క్లుప్తంగా

ఘనంగా సూర్యదేవుని శాంతి కల్యాణం



స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

గోకవరం: గంగంపాలెం గ్రామంలో మంగళ వారం సూర్యదేవుని శాంతి కల్యాణం ఘనంగా జరిగింది. సనాతన ధర్మప్రబోధనా స్వచ్ఛంద సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత ఉషాపద్మినీ, చాయా సమేత సూర్యనారాయణస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణల మధ్య శాంతి కల్యాణం జరిపారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబా, ఉపాధ్యక్షుడు అక్షింతల రాజా, ప్రధాన కార్యదర్శి దోసపాటి సుబ్బారావు, సభ్యులు కొరిపల్లి అప్పలస్వామి, పిల్లంగోరు పాపారావు, దివిలి వీరబ్రహ్మం, ద్వారంపూడి నాగిరెడ్డి, కర్రి సూర్యనారాయణరెడ్డి, గట్టి త్రిమూర్తులు, కాండ్రేగుల నాగేశ్వరరావు, అరిసెపు బుల్లబ్బులు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కిర్లంపూడి: ఆంజనేయస్వామి జయంతి ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని కిర్లంపూడిలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రశాంతంగా ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తుని రూరల్: హంసవరం గ్రామంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం పాఠశాలలో మిగిలిన ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో ప్రవేశాలకు ఈ పరీక్ష నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ పి.పద్మజ తెలిపారు. 61 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. ఫలితాలు ఈ నెల 14 సాయంత్రం నుంచి పాఠశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉంటాయన్నారు.

ఆదిత్య ప్రొఫెసర్‌కు డాక్టరేట్



ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర్లకు డాక్టరేట్ లభించినట్టు విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. ప్రొఫెసర్లు కె.రవిశంకర్, కేవీ రమణమూర్తి నేతృత్వంలో వెంకటేశ్వర్లు సమర్పించిన ఫార్మలేషన్ అండ్ ఎవాల్యూయేషన్ ఆఫ్ కోలన్ టార్గెటెడ్ డ్రగ్ డెలివరీ సిస్టం ఆఫ్ వేన్కమీసిన్ హెచ్‌సీఎల్ అనే అంశంపై రిసెర్చ్ చేసినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లకు విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ప్రిన్సిపాల్ కె.రవి శంకర్, అధ్యాపకులు తదితరులు అభినందనలు తెలిపారు.

ఆశా కార్యకర్తలకు అవగాహన

గండేపల్లి: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఆశా కార్యకర్తలకు పలు అంశాలపై వైద్యాధికారి బి.సురేంద్ర అవగాహన కల్పించారు. డయేరియా సమయంలో ఓఆర్ఎస్, జింక్ వాడకం, పరిసరాల పరిశుభ్రత, తాగునీరు పరిశుభ్రత, గర్భిణులందరు తల్లిబిడ్డ(102) ఎక్స్‌ప్రెస్ సేవలు వినియోగం, డ్రైడే, ఇంటింటి సర్వే ద్వారా దోమ లార్వా తొలగించుట, జ్వరం కేసులు గుర్తించడం, టీకాలు వేయించడం, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తు ఆయా గ్రామాలలో ప్రజలకు తెలియజేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శర్మ, హెచ్‌ఎస్ చెల్లారావు పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం

తొండంగి: వేమవరానికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు కాకినాడ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న మహిళకు ఆర్థికం సాయం అందించారు. విశాఖ జిల్లా సరిహద్దు ప్రాంతమైన పాయకరావుపేట మండలం రాజానగరం గ్రామానికి చెందిన పేద మహిళ మేరుగు మణి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. కాకినాడ ఆస్పత్రిలో వైద్యం పొందుతు ఇబ్బంది పడుతోంది. ఆమె స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు రూ.30 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో నేమాల శ్రీనివాస రావు, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో భూసారం

- రసాయనిక ఎరువులతో పెట్టుబడి భారం
- పాత పద్ధతులను అవలంబిస్తున్న రైతులు
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



పశువుల పెంటను పొలానికి తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు



సేంద్రియ ఎరువును ట్రాక్టర్‌లో వేస్తున్న రైతులు

ప్రత్తిపాడు రూరల్: సేంద్రియ ఎరువులతో భూమి సారవంతంగా మారడంతోపాటు అధిక దిగుబడి పొందవచ్చు. రైతులు ఆధునిక పద్ధతులను వదిలి పాత పద్ధతులను అవలంబిస్తున్నారు. పూర్వపు రోజుల్లో రైతులంతా వేసవిలో తమ పొలాల్లో సేంద్రియ ఎరువులు చల్లి సాగుకు సిద్ధం చేసేవారు. కాలక్రమంలో రసాయన ఎరువుల వినియోగం పెరగడం, పెట్టుబడి భారంగా మారడంతో మళ్లీ పాత పద్ధతినే అనుసరించేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. వారి ఆలోచనలకు అనుగుణంగానే వ్యవసాయశాఖ అధికారులు సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది.

భూసారం పెంపుపై దృష్టి

భూసారం పెంపొందించేందుకు రైతులు పశువుల పేడ, గొర్రెలు, మేకల ఎరువు, చెరువులు, కుంటల్లో పేరుకుపోయిన రేగడి మట్టిని, కోళ్ల ఫారంలోని పెంటను పొలాలకు తోలుకుంటున్నారు. పశు సంపద లేని రైతులు మాత్రం సేంద్రియ ఎరువును కొనుగోలు చేసి పొలాలకు తరలిస్తున్నారు. తొలకరి వర్షాలు ఊపందుకున్న తరువాత ఎక్కువగా వరి, అరటి, కూరగాయలు, చెరకు తదితర పంటలు సాగు చేయనున్నారు. అంతే కాకుండా అంతర పంటలపై ఆసక్తి చూపుతున్నారు. ప్రత్తిపాడు మండలంలో 15,577 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉంది. ఇందులో 10,500 ఎకరాల్లో వరి, 1500 ఎకరాల్లో ప్రత్తి, 925 ఎకరాల్లో మినుములు, 105 ఎకరాల్లో పెసలు, 2,547 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేసే అవకాశం ఉన్నట్టు మండల వ్యవసాయ అధికారి వై.గంగాధర్ తెలిపారు.

రసాయన ఎరువులతో అదనపు భారం

పంటలకు రసాయనిక ఎరువులు వాడే రైతులు అధిక ఖర్చు చేయాల్సివస్తోంది. తద్వారా పెట్టుబడి పెరగడమే కాకుండా చీడ పురుగులు, తెగుళ్లు వీడక పోగా, పంట దిగుబడి తగ్గుతోంది. ఈ విషయాలపై వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు జాగ్రత్తలు తెలియజేస్తున్నారు. పంట సాగు, ఎరువుల వాడకం, మట్టి నమూనాలు తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు.

రైతులకు ఖర్చు ఆదా



సేంద్రియ ఎరువులు వాడటం వల్ల భూమి సారం పెరుగుతుంది. నీటి సామర్థ్యాన్ని పెంచుతుంది. పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి. దీనివల్ల పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూమిలో చౌడు, ఉప్పు లవణాలు తగ్గి పంట ఉత్పత్తి పెరుగుతుంది. మొక్కలకు అవసరమైన పొటాషియం, నత్రజని, కాల్షియం, బోరాన్, జింక్ లాంటి పోషకాలు సేంద్రియ ఎరువుల్లో లభిస్తాయి. అంతేకాకుండా చీడ పీడలను నివారించడానికి దోహదపడతాయి. ఖర్చు ఆదా అవుతుంది.

– వై గంగాధర్, మండల వ్యవసాయ అధికారి, ప్రత్తిపాడు

అమ్మో ఇవెక్కడి ఎండలు



తునిలో నిర్మానుష్యంగా కనిపిస్తున్న రహదారి

- ఇళ్లకు పరిమితమైన ప్రజలు
- నిర్మానుష్యంగా రోడ్లు

తుని: నైరుతి పవనాలు కేరళలో ప్రవేశించినా వాతావరణంలో మాత్రం ఎటువంటి మార్పులు కానరాలేదు. సూర్యుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. మంగళవారం తునిలో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 10 గంటలకే సూర్య కిరణాలు నిప్పుల వర్షాన్ని కురిపించాయి. తుని పట్టణంలోని రోడ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. సాయంత్రం 6 గంటల వరకు వడగాల్పులు వీచాయి. ప్రజలు ఎండకు భయపడి ఇళ్లకు పరిమితమయ్యారు. వేడి గాలులకు చిన్నా పెద్దా తేడా లేకుండా విలవిల్లాడారు. ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందడానికి మజ్జిగ, కొబ్బరి నీళ్లు, బార్లి, చెరకు రసం, పండ్ల రసాల కోసం పరుగులు తీశారు. మరో రెండు రోజుల పాటు వాతావరణం ఇలానే ఉంటుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

కేరళకు జగ్గంపేట విద్యార్థులు



జగ్గంపేటలో బస్సును జెండా ఊపి ప్రారంభించిన ప్రముఖులు

జగ్గంపేట: కేరళలోని పెరిగొట్టుకూర్ దేవస్థానం, విష్ణుమాయ ఆలయంలో జరుగుతున్న కూచిపూడి నృత్యప్రదర్శనకు జగ్గంపేట, ప్రత్తిపాడు మండలం ధర్మవరం నుంచి 20 మంది విద్యార్థులు తరలివెళ్లారు. జగ్గంపేటకు చెందిన సీతారత్నం లలిత కళా నృత్య నికేతన్ ఆధ్వర్యంలో నాట్యాచారిణి ముళ్లపూడి విజయలక్ష్మి తన శిష్యబృందాన్ని, వారి తల్లి దండ్రులను కేరళ తీసుకువెళుతున్నారు. వీరికి రాష్ట్ర అర్చక పురోహిత విభాగ ప్రధాన కార్యదర్శి మామిళ్లపల్లి అయ్యప్ప ప్రత్యేకమైన బస్సు ఏర్పాటు చేశారు. జగ్గంపేటలోని రావులమ్మ తల్లి ఆలయం వద్ద బస్సును టీడీపీ నేతలు, ప్రముఖులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కళాకారులకు ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, వేములకొండ జోగారావు తదితర పాల్గొన్నారు.

గోకవరంలో వర్షం

గోకవరం: మండలంలో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపడంతో ప్రజలు తీవ్ర ఉక్కబోతను ఎదుర్కొన్నారు. కానీ సాయంత్రం నాలుగు గంటల నుంచి వాతావరణం ఒక్కసారిగా మారింది. ఆకాశం మేఘావృతమై చల్లగాలులతో వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి ఇబ్బంది పడుతున్న ప్రజలు సేదతీరారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సమాచారంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సొసైటీ త్రిసభ్య కమిటీ రాజీనామా

శంఖవరం: స్థానిక గ్రామానికి చెందిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ)కు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ మంగళవారం రాజీనామా చేసింది. త్రిసభ్య కమిటీ అధ్యక్షుడిగా పర్వత సత్యనారాయణమూర్తి, డైరెక్టర్లుగా ఈగల గంగా వెంకట సతీష్, గుద్దాటి నాగేశ్వరరావు తమ పదవులకు రాజీనామా చేసి, ఆ పత్రాలను సొసైటీ కార్యదర్శి పడాల నూకరాజుకు అందజేశారు.

అన్ని విధాలా అండగా ఉంటాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోటనరసింహం



సమావేశానికి తరలివచ్చిన పార్టీ నేతలు,కార్యకర్తలు

- నియోజవర్గ నేతల సమావేశంలో తోట నరసింహం
- ఎంపీ ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు శుభాకాంక్షలు

జగ్గంపేట: అసెంబ్లీ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ఓటమితో కుంగిపోవద్దుని, ఎటువంటి సమస్యలు ఎదురైనా నేతలకు, కార్యకర్తలకు తాము అండగా ఉంటామని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. జగ్గంపేట పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఎన్నికల ఫలితాలపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. నియోజకవర్గ సీనియర్ నేత అత్తులూరి సాయిబాబా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపొందిన కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలపై అందరిలోను అనేక అనుమానాలు ఉన్నాయని అన్నారు. అయినా ప్రజా తీర్పును గౌరవించాలని తెలిపారు. మన వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఎన్నికల ఫలితాలను సమీక్షించి, గెలుపు ఓటములు సహజమని అయితే రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ గెలుపు కోసం కృషి చేయాలని అన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికలలో ఏదో మోసం జరిగిందన్న భావనను అనేక మంది ఆయన ముందు లేవనెత్తారని, తమలో బాధను తెలియజేసినా జగన్‌మోహన్‌రెడ్డి వారందరని చిరునవ్వుతో ఓదార్చారని చెప్పారు. రాబోయో రోజులలో ఎవరికి ఏ కష్టం వచ్చినా పార్టీ నేతలకు తాను తన కుమారుడు తోట రాంజీ అండగా ఉంటామని చెప్పారు. ఆరు నెలలు తరువాత తమకి కొత్త ప్రభుత్వ పరిపాలనపై ప్రశ్నించే అవకాశం కలుగుతుందని అన్నారు. అధికార పార్టీ నేతల నుంచి కార్యకర్తల నుంచి కవ్వింపు చర్యలు వచ్చినా సహనంతో ఉండాలని తెలిపారు. ఇర్రిపాకలో తమ పార్టీ కార్యకర్తపై జరిగిన దాడిలో గాయపడిన యువకుడికి అన్ని విధాల అండగా ఉంటామని, వైద్యం చేయించామని, దాడికి పాల్పడిన వారిపై కేసులు పెట్టామని తోట నరసింహం వివరించారు. ఈ సమావేశంలో పార్టీ ఓటమిపై నియోజకవర్గానికి చెందని పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువనేత తోట రాంజీ, నియోజకవర్గ సీనియర్ నేతలు అత్తులూరి సాయిబాబు, గుల్లా ఏడుకొండలు, రావుల గణేష్ రాజా, పాటి రాంబాబు, మద్దిపట్ల రామకృష్ణ, తులా రాము, గండేపల్లి ఎంపీపీ చలగ్ల దొరబాబు, దాసరి చిన్నబాబు, సుంకర వీరబాబు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

మోటార్ సైకిలిస్టుకు తీవ్ర గాయాలు



ప్రమాద స్థలంలో ఉన్న ఆర్టీసీ బస్సు

గండేపల్లి: జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ప్రయాణికులు త్రుటిలో బయటపడగా ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసుల కథనం మేరకు విశాఖ నుంచి గుంటూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు గండేపల్లి వచ్చేసరికి సింగరంపాలెం మార్గం నుంచి బైక్‌పై వస్తున్న పి.భద్రరావు పంచాయతీ రోడ్డులోకి వెళ్లేందుకు హైవేని దాటుతుండగా అతనిని తప్పించే ప్రయత్నంలో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయి విద్యుత్ స్తంభాన్ని స్వల్పంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో భద్రరావు తలకు గాయాలు కాగా బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 30 మంది సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదంలో గాయపడిని క్షతగాత్రుడిని గండేపల్లి ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ తన కారులో రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఏఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేయనున్నట్టు తెలిపారు. ఇదిలా ఉండగా బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన సమయంలో విద్యుత్ పోల్స్‌కు ఉన్న తీగలు తెగి బస్సుపై పడి ఉంటే భారీ ప్రాణనష్టం జరిగేదని గ్రామస్తులతోపాటు ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

అభివృద్ధికి ఆమడదూరం



స్థానిక షిర్డినగర్ గాంధీజీ విగ్రహం వద్ద తుప్పలు పెరిగిపోయిన పార్కు



షిర్డీనగర్‌లో నిరుపయోగంగా ఉన్న పార్కు స్థలం

- నిరుపయోగంగా పార్కులు, స్థలాలు
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు
- పట్టించుకోని అధికారులు

ఏలేశ్వరం: రోజంతా అలసిపోయి కాసేపు ఉపశమనం పొందేందుకు పార్కులు ఎంతోగానో ఉపయోగపడతాయి. పిల్లల శరీరదారుఢ్యానికి ఆటస్థలాలు కీలకపాత్ర పోషిస్తాయి. పిల్లలతో పాటు వృద్ధులు సేదతీరడానికి దోహదపడతాయి. అలాంటి పార్కులు, వాటికి కేటాయించిన స్థలాలు నిరుపయోగంగా మారడంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలోని సుమారు పది వరకూ పార్కులు ఉండగా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం పట్టణ పరిధిలోని పంట భూములను, ఖాళీ స్థలాలను లేఅవుట్‌లుగా మారిస్తే కొంత స్థలం పార్కుకు కేటాయించాల్సి ఉంటుంది. నగరపంచాయతీగా హోదా వచ్చిన నాటినుంచి పట్టణంలో పలుచోట్ల లేఅవుట్లు వేశారు. వీటి నిమిత్తం కేటాయించిన పార్కు స్థలాలు నిరుపయోగంగా మారాయి. దీంతో ఈ స్థలాలు కొన్నిచోట్ల ఆక్రమణలకు గురవుతుండగా మరికొన్ని చోట్ల తుప్పలు పేరుకుపోయాయి. స్థానిక షిర్డినగర్ గాంధీజీ విగ్రహం వద్ద నిర్మించిన పార్కులో తుప్పలు పెరిగిపోయాయి. దీంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా పార్కు నిర్మించి దాదాపు ఐదేళ్ల అవుతున్నా ఇప్పటివరకు ప్రారంభం కాకపోవడం విశేషం.

పట్టణంలోని స్థలాలు..

పట్టణంలో పార్కులుగా కేటాయించిన స్థలాలు నిరుపయోగంగా మారాయి. స్థానిక పెద్దవీధి, షిర్డినగర్, షిర్డినగర్ గాంధీజీ విగ్రహం, దిబ్బలపాలెం, తదితరప్రాంతాల్లో పార్కులు ఉన్నాయి. వీటితో పాటు కొన్నిప్రాంతాల్లో స్థలాలు ఉన్నాయి. స్థలాలు చాలాచోట్ల ఆక్రమణలు గురయ్యే ప్రమాదం అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠ్య, నోట్ పుస్తకాలు సిద్ధం



పాఠ్య, నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు

కిర్లంపూడి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్న పాఠ్య, నోట్ పుస్తకాలు కిర్లంపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని స్టాక్ రూమ్‌కు చేరాయని ఎంఈఓలు టి.జోషప్, మాకా చిన్నారావు మంగళవారం తెలిపారు. 2024–2025 విద్యా సంవత్సరానికి గాను తొలి విడతగా 36,452 నోట్ బుక్స్, 3,898 పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. వీటిని పాఠశాలల వారీగా క్రమపద్ధతిలో హెచ్ఎంలకు పంపిణీ చేస్తారని వివరించారు. మండల ఇన్‌ఫర్మేషన్ సిస్టం కోఆర్డినేటర్ తంగేళ్ల శ్రీను, సీఆర్పీలు బాబ్జీ, బి.ఇంద్ర, సిబ్బంది ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



గోనేడ ఎరువుల షాపులో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏవో అమృత

కిర్లంపూడి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కిర్లంపూడి ఏఓ జోకా అమృత హెచ్చరించారు. మండలంలోని గోనేడ, తామరాడ, ముక్కొల్లు, వీరవరం, రామచంద్రపురం గ్రామాల్లోని ఫెర్టిలైజర్స్ దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డుల నిర్వహణ, స్టాక్ వివరాలను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో 80–85 మొలకశాతం కలిగిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. రైతులకు తెలిసేలా ప్రతి ఎరువుల షాపు వద్ద విత్తనాల ధరల పట్టిక ప్రదర్శించాలని షాపు డీలర్లకు సూచించారు. ప్రభుత్వం ధ్రువీకరించిన షాపుల వద్దనే రైతులు విత్తనాలు కనుగోలు చేసి, రశీదు పొందాలని రైతులకు తెలిపారు.

పేదలకు సీలింగ్ భూముల పట్టాలు అందజేయాలి

జగ్గంపేట: గుర్రంపాలెం సీలింగ్ భూముల పట్టాలను దళిత, పేదలకు ఇవ్వాలంటూ జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను జగ్గంపేట రెవెన్యూ అధికారులు తక్షణం అమలు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు జగ్గంపేటలో తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేపట్టి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందచేశారు.ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు మాట్లాడుతూ గుర్రంపాలెం సీలింగ్ భూమిని ఎన్నో సంవత్సరాలుగా గ్రామానికి చెందిన దళిత ఇతర వర్గాలకు చెందిన పేదలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. వీరికి పట్టాలు ఇవ్వాలని కోరుతూ గత సంవత్సరం డిసెంబర్ నెలలో తహసీల్దార్ కార్యాలయం వద్ద 16 రోజులు నిరవధిక నిరాహార దీక్షలు చేశామన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దాపురం ఆర్డీఓ విచ్చేసి తమతో చర్చించి, పేదలకు పట్టాలు ఇస్తామంటూ హామీలు ఇచ్చి ఆందోళన విరమింపచేశారని తెలిపారు. హామీ ఇచ్చి ఏడు నెలలు అవుతున్నా అధికారులు పట్టించుకోవటంలేదని విమర్శించారు. దీనిపై డివిజన్, మండల స్థాయి అధికారులను అనేక సార్లు కలిశామని కాని జగ్గంపేట తహసీల్దార్ కలెక్టర్ ఆదేశాలను అమలు చేయడంలేదని ఆరోపించారు. తక్షణం అధికారులు స్పందించకపోతే మళ్లీ ఆందోళన ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, సహాయ కార్యదర్శి కడిత సతీష్, సంఘం నేతలు దేశెట్టి సురేష్, చిన్న చేదులూరి లక్ష్మి, వడ్లమూరి ఏసమ్మ, చల్లా రత్నం తదితరులు పాల్గొన్నారు.

సీఎం ప్రమాణ స్వీకారోత్సవం వీక్షించేందుకు ఏర్పాట్లు

జగ్గంపేట: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందకు జగ్గంపేటలో సాయిబాలాజీ పంక్షన్ హాల్‌లో ప్రత్యక్ష ప్రసారానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ విషయాన్ని మండల పరిషత్ అధికారి ఎం.వసంతకుమార్ తెలిపారు.

ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్వరూపారాణి

గోకవరం: స్థానిక ఎఫ్‌పీపీపిన్స్ లేఅవుట్‌లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం మంగళవారం ముగిసింది. విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 204 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 30 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. అలాగే 96 మందికి కంటి సమస్యలతో బాధపడుతున్నట్టు గుర్తించి ఉచితంగా కళ్లజోళ్లు అందించేందుకు చర్యలు చేపట్టారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా చేయిస్తామన్నారు. డాక్టర్ స్వరూపారాణి, రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాధశర్మ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ



ఎ.వి.నగరంలో ర్యాలీ చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

తొండంగి: మలేరియా దోమల నిర్మూలనపై వైద్యారోగ్యశాఖ సిబ్బంది మంగళవారం ఎ.వి.నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జూన్ ఒకటి నుంచి ఈనెలాఖరు వరకూ మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఎ.వి.నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్, వైద్యురాలు పి.భారతి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ చేశారు. దోమల నివారణపై ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగు నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, కొబ్బరి చిప్పలు, పాడైన టైర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో సత్యవతి, హెల్త్ సూపర్‌వైజర్లు ఏసురత్నం, మణి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.